ఇల్యూస్ట్రేటర్స్‌వర్క్‌షాప్

రచయిత కథ

## మానవత్వంతో రక్షించిన వ్యక్తికి అతనిచ్చిన ప్రతిఫలం?

# నేటి సిద్ధార్థ

యర్రా అచ్యుత రామయ్య కథ

ఇంతకు ముందు అమరేషుకు ఆఫీసుకు వెళ్లడమంటేనే భయంగా వుండేది. ఇప్పుడు ఆఫీసు నుండి ఇంటికి వెళ్లడమంటే కూడా భయంగా వుంది. టోటల్‌గా బ్రతుకంటేనే భయంగా వుంది. ఆ భయం చేతివ్రేళ్ల వరకు ప్రాకడంతో— టైపు చేయడం కష్టమనిపించింది. బాసు 'అర్జంట్' అని చెప్పిన లెటరు ఇంతకు ముందే చేసి ఇచ్చేసాడు. తర్వాత ఇచ్చిన లెటరు లేటుగా టైప్ చేసినా ఏంకాదులే అనిపించింది.


రాత్రి— భార్యకూ, అతనికీ మధ్య జరిగిన సంభాషణ పదేపదే గుర్తుకు వస్తోంది.

....

మంచంపై పడుకుని ఆఫీస్ వర్క్ గురించి ఆలోచిస్తూ, తల మునకలై తను వుంటే— భార్య వచ్చి "ఈ దరిద్రపు కాపురం నేనింక చేయలేను. కిరాణా షాపువాడు, పాల సైకిల్ వాడు, ఇంటి ఓనరు... ఇలా అందరూ డబ్బు వెంటనే చెల్లించమని నన్ను వడిరోడ్డుమీద నిలబెట్టి పరువు తీసేస్తున్నారు. మీరేమో ప్రొద్దుటనగా పోయి, రాత్రికి కొంప చేరతారు.. నేనింతగా గొంతు చించుకుంటున్నాను— మీరేమైనా వింటున్నారా!" అంది.

వెంటనే అమరేషు, "ఆఫీసు తలనొప్పులతోనే పరిపెట్టుకోలేక నేను చస్తుంటే... మధ్యలో నీ గోలేమిటి? నువ్విలా గొడవ చేసేవంటే, నేను వెంటనే ఆత్మహత్య చేసుకుంటానంతే!" అని బెదిరించాడు.

ఆ మాటకు భార్యకు విపరీతంగా కోపం వచ్చింది. "చావు... వెంటనే చావు. అప్పుడు— మొగుడు చచ్చిన ముండని ఎవరైనా



జాలిపడి సహాయం చేస్తారు. ఛీ... నీ బ్రతుకు చెడా!'' అని ఏడుస్తూ కూర్చుంది.

ఆడదాని ముందు పూర్తిగా ఓడిపోయిన మగాడు సంధించే ఆఖరి అస్త్రాన్ని అమరేషు బయటకు తీసాడు. "ఆ పాల సైకిలాడితో నువ్వు గుసగుసలాడుతున్నప్పుడే అనుకున్నా.. నేను చస్తే, వాడితో లేచిపోదామనా?''

అతని చెంప పగిలే వరకూ తెలియలేదు — ఆడవాళ్లక్కూడా అంత పౌరుషం వుంటుందని...

"అమరేషు సార్, పెద్దసార్ పిలుస్తుందు నిన్ను" అన్న ఆఫీస్ బాయ్ పిలుపుతో— ప్రవాహంలో కొట్టుకుపోతున్నవాడి కాలికి కొండ చిలువ చుట్టుకున్నట్లు— ఉలికిపాటుతో అతనీ లోకంలోకి వచ్చాడు.

ఇలా... ఇంటిలో ఆఫీస్ గురించీ, ఆఫీసులో ఇంటి గురించీ ఆలోచించే— రెండు చోట్లా తన విధులను సక్రమంగా నిర్వర్తించలేక— 'చేతకాని దద్దమ్మ' అనే బిరుదును మాత్రం సంపాదించాడు.

హడావిడిగా మేనేజరు కేబిన్‌లోకి అడుగుపెట్టాడో లేదో, "ఏమయ్యా, నీకేమైనా బుద్ధుందా? ఆరు లైన్ల లెటరులో అరడజను కు పైగా తప్పులా! నీకంటే మన ఆఫీసు బాయ్ బాగా టైప్ చేస్తాడు కదయ్యా! రోజూ ఇలా ఛీ— అనిపించుకునే బదులు, ఒక్కసారిగా చావకూడదూ!" అని బాసుడు తోక త్రొక్కిన త్రాచులా లేచాడు.

బాసు విసిరేసిన లెటరును తీసుకుని అమరేషు వెమ్మదిగా బయటపడ్డాడు. అతన్ని చూసి కొలీగ్స్ అంతా ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. పై వాడితో చివాట్లు తినని క్రింది వాడున్నాడా, అసలు? 'గురివింద గింజలు' అని మనస్సులోనే కసిగా తిట్టుకున్నాడు.

ఆఫీసు వదలిపెట్టిన వెంటనే ఇంటికి వెళ్లడానికి అతని మనస్సు అంగీకరించడం లేదు. ఇంట్లో భార్యా, ఆఫీసులో బాసూ తనను ఛీకొట్టి, చావమని శాసించాకా కూడా— తనింకా ఏ మొహం పెట్టుకుని బ్రతకాలి? తను ఇంకే మాత్రం ఈ దుర్భర జీవితాన్ని కొనసాగించలేడు. ఇటువంటి కుక్క బ్రతుకు బ్రతికేకంటే దీనికి చరమగీతం పాడటమే మంచిది. మూడు పదులు దాటాయో లేదో అప్పుడే జీవితం ఎంతో డొల్లగా కనిపిస్తోంది అతనికి.

రకరకాల ఆలోచనలతో అమరేషు అలా ఎన్ని మైళ్లు నడిచాడో అతనికే తెలియదు. శరీరమంతా వణుకు పుడుతోంది. కాళ్ల నుండి రక్తం అతి వేగంగా పైకి పాకడం అతనికి తెలుస్తూనే వుంది. చుట్టూ చూస్తే దట్టమైన అడవిలా వుంది. కళ్లు తిరుగుతున్నట్లనిపిస్తే, అతను దగ్గరలోనే వున్న ఒక చెట్టు నీడన పడుకున్నాడు.

* * *

సూర్యుని లేత కిరణాలు చెంపను సుకుమారంగా నిమురుతూ వుంటే, అప్పుడు అమరేషుకు మెలకువ వచ్చింది.

నెమ్మదిగా కళ్లు తెరిచాడు. కడుపులో యాసిడ్ పోసినట్లుగా ఒకటే మంట. ఒక్కరోజు తిండిలేక పోతేనే తనింతగా నీరసపడిపోయాడే, రోజుల తరబడి తిండి దొరకని వాళ్ల పరిస్థితి ఇంకెలా వుంటుందో కదా అనుకుంటూ తన ఒంటిపై సగం వరకూ కప్పిన దుప్పటిని అప్పుడే గమనించాడు. ఈ అడవిలో తనకీ దుప్పటి కప్పిన పుణ్యాత్ములెవరో? చుట్టూతా కలియచూసాడు. కనుచూపు మేరలో ఎవరూ కనిపించలేదు. తనింత తెలివి తక్కువగా ఈ అడవిలోనికి ఎలా వచ్చాడో? రాత్రి ఏ

పులయినా వచ్చి తినేసి వుంటే?... ఆ రకంగానైనా తన జీవితానికి విముక్తి దొరికేదే మో!

అంతలో ఓ యువకుడు అటుగా వస్తూ అమరేషును నవ్వుతూ పలకరించాడు. సు మారుగా పాతికేళ్లుంటాయతనికి. గడ్డం మాసి వున్నా— అతని మొహం సూర్యుడిలా ఎంతో వెలుగును వెదజల్లుతోంది. అతని భుజానికి వ్రేలాడుతున్న తుపాకీని చూసి అమరేషుకు వెంటనే భయం కలిగినా, జీవితాన్ని ముగించడానికి సిద్ధపడ్డ తనకు భయం లేనివాని ధైర్యం తెచ్చుకున్నాడు.

ఏ క్రూర జంతువు నోటా పడకుండా తనను రాత్రంతా కాపాడి, దుప్పటికప్పి చలి బాధి నుండి రక్షించింది ఇతనేనన్న మాట!

తన ఆకలిని గ్రహించినవాడిలా ఆ యువకుడు తేనెతుట్టె పట్టుకుని వచ్చాడు. తేనెటీగ కుట్టిందో ఏమో అతని బుగ్గ వాచిందివ్రరగా. వెంటనే అతనుఅమరేషు నోటిలో తేనెను పిండుతూ వున్నాడు. తేనెతుట్టె పెద్దది కావడం వల్ల అమరేషు కడుపు నిండిపోయింది — ఆకలి తీరిపోయిం ది. అప్పుడుకాని అతనికి ఆ అడవిలోని అందాలు కనిపించలేదు.

పేర్లే తెలియని పెద్దపెద్ద గుబురు వృక్షాల మీద పక్షులనేకం చేరి సంగీత కచేరీ చేస్తున్నాయి. దట్టంగా పెరిగిన మొక్కలతో ఆ ప్రాంతమంతా పచ్చటి దుప్పటి కప్పిన ట్లుగా వుంది. ఏదో తెలియని ఆనందం అతన్ని ఆవహించింది. తను బ్రతుకీడ్చే నరకంలాంటి నగరానికి అతి దగ్గరలోనే ఇంతందమైన అడవి వున్నట్లు అంత వరకు అతనికి తెలియదు.

తనకిన్ని సపర్యలు చేసిన ఇతను ఎవరు? అతని గురించి తెలుసుకోవాలని అమరేషుకు అప్పుడు అనిపించింది.

ఆ అపరిచితుని వైపు కృతజ్ఞతగా చూ స్తూ— "నా ప్రాణాలు నిలిపినందుకు మీకునేనెంతో ఋణపడివున్నాను...



## దండ

రాజకీయ నాయకుణ్ని ఇంటర్వ్యూ చేస్తున్నాడు విలేకరి.

"మొన్న మీరు పాల్గొన్న సభలో మీకు ప్రజలు చెప్పుల దండ వేశారట"

"అవును. ఆ ప్రాంతంలో పూలు దొరకవట. మండుటెండలో కాళ్లు కాలుతున్నా లెక్క చేయకుం డా చెప్పులదండ వేశారయ్యా. ఏదైతేనేం దండే కదా!"

— మక్కాల గోపీచందర్ (మహబూబాబాద్)

మీరేపేమిటో, ఇక్కడేం చేస్తుంటారో తెలుసుకోవచ్చా?'' అంటూ స్నేహపూర్వకంగా అడిగాడు.

''నా పేరు సాగర్. మెడిసిన్ మధ్యలో వదిలేసి, ఇక్కడ జరుగుతున్న గిరిజన పోరాటానికి నాకు తోచిన సహకారాన్ని అందించడానికి వచ్చాను''.

''అయితే మీరు న..క్స..లై..టా?''

''... అని మా శత్రువు అంటున్నాడు. ఏం మీకు భయంగా వుందా?'' అన్నాడు సాగర్ నవ్వుతూ.

''చావును వెతుక్కుంటూ వచ్చిన వాణ్ణి — నాకు భయం దేనికి?''

''ఇంతటి చిన్న వయసులోనే అంతటి వైరాగ్యం ఎందుకు కలిగిందో?''

''ఇన్ని కష్టాలను ఎదుర్కొని బ్రతకాల్సినంత గొప్పగా ఈ జీవితం కానీ, సమాజం కానీ లేవు''.

''కష్టాలుండని సమాజం కోసం కృషి చేయాలిగానీ, జీవితం నుండి పారిపోవడం పరిష్కారం కాదు కదా! గొప్ప ఆశయం, లక్ష్యం లేకపోతే జీవితం ఎంతో నిస్సారంగా కనిపిస్తుంది'' అన్నాడు సాగర్.

''నా సంగతి సరే. మీరు చేస్తున్నదేమిటి ? ఇక్కడున్న కోర్టులనూ, చట్టాలనూ లెక్క చేయకుండా ప్రజా కోర్టుల పేరిట లా అండ్ ఆర్డర్‌ను మీ చేతిలోకి తీసుకోవడం గొప్ప ఆశయమా? కూటికోసం ఎంతో రిస్క్ తీసుకుని బ్రతుకు వెళ్లదీస్తున్న పోలీసులను చంపడం మీ లక్ష్యమా?'' అనుకోకుండానే ఆవేశంగా అడిగాడు.

కోపం రావాల్సిందిపోయి, సాగర్ పెదవులపై చిరునవ్వు విరిసింది. ''ఈ సమస్యలన్నిటిపైనా లోతుగా చర్చించడానికి నాకు టైమూ లేదు, మీకు ఓపికా లేదుకానీ— నాతోపాటు వస్తే మీకో సజీవ ఉదాహరణ చూపిస్తాను''.

సాగర్ మాటల్లో ఏదో విజాయితీ ధ్వనించడంతో అమరేష్ అతని వెంట బయల్దేరాడు. చిన్న వాగు ప్రక్క పందుల గుడిసె కంటే అధ్వాన్నంగా వున్న చిన్నగుడిసె దగ్గరకు వెళ్లి ''నాగులన్నా!'' అని పిలిచాడు సాగర్. లోపలి నుండి ఒక ముసలతను బయటకు వచ్చాడు. అతని శరీరంమీద చిన్న గోచీ తప్ప ఇంకేమీ లేవు. సాగర్ ప్రక్కనున్న కొత్త వ్యక్తిని చూసి అతను బెదిరిపోయాడు.

సాగర్ ఆ వృద్ధుణ్ణి చూపిస్తూ, ''ఈ అడవిలోని మొక్కల్లో మొక్కగా, పక్షుల్లో పక్షిగా ఇతనూ పుట్టి పెరిగాడు. అతని కుటుంబంలోని వారంతా కండలు కరిగించి, బండలను పిండిచేసి— ఎప్పటి నుండో రెండెకరాల నేలను సాగు చేసుకుంటూ వుండేవారు. ఆ మధ్య పట్టణం నుండి ఓ జమీందారు ఇక్కడకు వచ్చి— దొంగ పట్టాలు సంపాదించి, ఇతని రెండెకరాల భూమితోపాటుగా అనేక స్థలాలను పోలీసుల అండతో కాజేసాడు. అన్యాయమని ఎదిరించినందుకు— ఇతని నాలుక తెగ్గోసాడు...''

భయంగా, ఆశ్చర్యంగా అతని మాటలను నోరు తెరచి వింటున్నాడు అమరేష్. సాగర్ గొంతులో ఆవేశం ధ్వనిస్తోంది. ''ఇక్కడి గిరిజనులంతా ఆ జమీందారుపై

తిరగబడితే— పోలీసు కేంప్ పెట్టించాడు. గిరిజన స్త్రీల మానప్రాణాలను పట్టపగలే పోలీసులు దోచేసారు. ఆ దారుణ మారణ కాండకు ఇక్కడున్న ప్రతిచెట్టూ పుట్టా సాక్ష్యంగా నిలబడతాయి. మిష్టర్ అమరేష్! — ఇప్పుడు చెప్పండి— లా అండ్ ఆర్డర్‌ను ఎవరు చేతిలోకి తీసుకుంటున్నారో? కూటి కోసమే అయినా, పోలీసులు ఎవరికోసం తమ ప్రాణాలను రిస్క్ తీసుకుంటున్నారో?–
''

తన గుండెనెవరో పిండుతున్నట్లనిపించింది అమరేషుకు. ఇంత వరకు తను శ్లేష్మంలో పడ్డ ఈగలా తన సమస్యలతోనే సతమతమవుతూ వున్నాడు. సమాజంలో ఒకడిగా జీవిస్తున్నందుకు తనూ సమాజానికి సేవ చేయాలి. సాగర్‌తోపాటుగా తనూ ఈ పోరాటాలను సమర్థిస్తూ పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. సిద్ధార్థుడికిమల్లే తనూ సంసారాన్ని, కోరికలనూ త్యజిస్తే తప్ప జ్ఞానోదయం కాలేదు. ఈ జ్ఞానాన్ని జనం మంచికోసం ఉపయోగించాలి.

ఇంతలో ఎవరో పరిగెత్తుకువి ఇటు వస్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపించింది. వెంటనే సాగర్— వెనుకగా వున్న వెదురు పొదలలో అదృశ్యమైపోయాడు. పది నిముషాల తర్వాత కొంతమంది పోలీసులు పరిగెత్తుకుంటూ ఇటువైపుగా వస్తున్నారు.

అప్పుడుకాని అమరేషుకు బయట ప్రపంచం ఒకటుందని గుర్తుకు రాలేదు. వాచ్ చూసుకునే సరికి టైం పదయినట్లూ, ఆ రోజు ఒకటవ తారీఖూ అన్నట్లూ తెలిసింది. అరె! జీతాల రోజన్నమాట! వెంటనే పోయి— జీతం తీసుకుని, పెళ్లాం బిడ్డలను సినిమాకు తీసుకెళ్లాలి. పాలవాడికి ఈసారి సగం డబ్బులైనా కట్టేయాలి.

శ్మశాన వైరాగ్యం, ప్రసూతి వైరాగ్యంలా — ఇంత వరకూ తను నెలాఖరు వైరాగ్యంలో వున్నట్లున్నాడు. ఇదేమిటీ— తను ఒక తీవ్రవాది మాటల గారడీకి లొంగిపోయి, అతని వలలో చిక్కుకుపోయాడు!

## తల్లిపాలుఅమృతమే



తల్లిపాలు పసికందుకు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తాయని అమెరికాలోని ఆరిజోనా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మరోసారి రుజువు చేశారు. వారు 1013 మంది పసికందుల్ని పరీక్షించిన తర్వాత కనీసం నాలుగు నెలలు తల్లి పాలు తాగిన బిడ్డ మిగిలిన వారికంటే 50 శాతం తక్కువగా చెవుకు సంబంధించినవేకాక మరెన్నో ఇతర వ్యాధులకు కూడా గురి అవుతారని అంటున్నారు. సో... కనీసం నాలుగు నుంచి ఆరు నెలల దాకా తల్లిపాలు ఇచ్చి మీ బిడ్డను అనారోగ్యం పాలు కాకుండా కాపాడుకోండని వారు ముక్త కంఠంతో చెప్తున్నారు! ఇక మీ ఇష్టం!!

– జూపిటర్

ఈ ఉచ్చునుండి బయట పడడం ఎలా? ఒక్క క్షణంలోనే ఇన్ని ఆలోచనలు అతన్ని చుట్టుముట్టాయి. మరుక్షణంలో అతను మామూలు అమరేషుగా మారిపోయాడు.

అంతలో పోలీసులు తుపాకులు గురిపెట్టి — అమరేషు చుట్టూ వలయాకారంలో నిలబడ్డారు. అతనికి కాళ్లలో వణుకు పుట్టింది.

ఎస్సై— అమరేషు వంక క్రూరంగా చూస్తూ "మర్యాదగా మాకు లొంగిపో. ఇంతకీ నువ్వే గ్రూపుకి చెందిన వాడివి?" అని గర్జించాడు.

"సార్, నాకేం తెలియదు..."

"ఇంకేం మాట్లాడకు. గత వెలరోజులుగా ఈ ప్రాంతంలో ఒక తీవ్రవాది తిరుగుతున్నట్లు మాకు కచ్చితమైన సమాచారం అందింది".

అమరేషు పెద్ద సందిగ్ధంలో పడ్డాడు. తనవాళ్లను కాదని, డబ్బు సంపాదించి పెట్టగల మంచి చదువును మధ్యలోనే వదిలేసి, సమాజాన్ని మార్చడానికని నడుం బిగించిన ఈ యువకుణ్ణి పోలీసుల చేత పట్టించడం తప్పుకాదూ?

అమ్మో— అలా అని వీడిని ఇలానే వదిలేస్తే— మళ్లీ వచ్చి తనను ఈ ఉద్యమంలోకి దిగమని బలవంతం చేసినా చేయవచ్చు. ఎందుకొచ్చిన పీడ అనుకుని వెంటనే అమరేషు—

"మీకందిన ఇన్ఫర్మేషన్ కరక్టే సర్. సాగర్ అనే తీవ్రవాది ఇప్పుడే ఈ వెనుకవైపుకు పారిపోయాడు. అతనితో నాకేం సంబంధం లేదుసార్. నేనో గవర్నమెంట్ కంపెనీలో పని చేస్తున్నాను. ఇదిగో నా ఐడెంటిఫికేషన్ కార్డు..."

చొక్కా, లాగు వేసుకున్న వాళ్లమీద మరింత అపనమ్మకంతో అక్కడున్న ఆ గిరిజనుడు గుడిసెలోకి పరుగుతీసాడు.

అంతలోనే వెనుకనున్న వెదురు పొదలలో తుపాకి కాల్పులు వినిపించాయి. "అబ్బా... విప్లవం వర్ధిల్లాలి! విప్ల..." అన్న కేకలు అడవంతా ప్రతిధ్వనించాయి.

*

